## క్లుప్తంగా

### అభివృద్ధిపై మాట్లాడండి



మాక్లూర్: ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అర్థం లేని మాటలతో కాంగ్రెస్ నాయకులపై విమర్శలు మాని, అభివృద్ధిపై మాట్లాడాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవి ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వినయ్‌రెడ్డికి రోజురోజుకు పెరుగుతున్న జనాదరణ చూసి తట్టుకోలేక ప్రొటోకాల్ పేరుతో ఎమ్మెల్యే రాద్ధాంతం చేస్తున్నారన్నారు. అభివృద్ధి చేయటం చేతకాక విమర్శలకు దిగుతున్నారన్నారు. ఇకముందు అర్థంలేని ఆరోపణలు చేస్తూ విమర్శిస్తే రోడ్లపై తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు గంగాధర్‌గౌడ్, దయాకర్‌రావు, వెంకటేశ్వర్ రావు, బూరోల్ల అశోక్, గుండారం శేఖర్, కాశీనాథ్‌రావు, అలీం, గంగాధర్ పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



రుద్రూర్: పోతంగల్ మండలం కొడిచర్ల శివారులోని మంజీరా నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కొడిచర్ల రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వారు పోతంగల్ తహసీల్ కార్యాలయంలో, కోటగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పోతంగల్ శివారులో అనుమతి పొంది అక్రమంగా కొడిచర్ల శివారులో ఇసుక తవ్వకాలు జరపడం వల్ల ఎత్తిపోతల పథకం, బోర్ల నీళ్లు ఇంకిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పంట సాగుకు ఇబ్బంది వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

రుద్రూర్: పోతంగల్ మండల ఆశా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా స్వప్న, ప్రధాన కార్యదర్శిగా రేష్మా, కోశాధికారిగా ఫర్జానా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమణి, కార్యవర్గ సభ్యులుగా పద్మ, సునీత, నాగమణి, మమత, అనిత, రుక్మిణి, సవితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆశా కార్యకర్తల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు సన్నేసాబ్ తదితరులు ఉన్నారు.

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



బాల్కొండ: మండల కేంద్రంలో శుక్రవారం ఆటో, మోటార్ వాహనాల బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను టీయూసీఐ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న మాట్లాడుతూ..ఆటో, క్యాబ్, ట్యాక్సీ డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న ఆటో, మోటార్ల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి



మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి బీజేపీ కార్యకర్త ప్రజలకు వివరించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఏ ఒక్క హామీని సరిగా నిలబెట్టుకోలేదని ఆయన విమర్శించారు. భీమ్‌గల్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆరు గ్యారంటీలు 66 అబద్ధాలు అనే నిరసన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు మోహన్‌రెడ్డి, యోగేశ్వర్ నర్సయ్య, ఆరె రవీంధర్, మహిపాల్, కనికరం మధు, సంధ రాజు, గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌పోటీలకు ఎంపికైనట్లు పీడీ గంగామోహన్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు నిత్యశ్రీ, సరిత, పవన్ ఎంపికయినట్లు తెలిపారు.

# అంబేడ్కర్‌కు ఘన నివాళి



మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, కాంగ్రెస్ నేతలు



సాలూర మండల కేంద్రంలో..



రెంజల్ మండలం కూనేపల్లిలో..



బోధన్‌లో..



ఆర్మూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యాక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. దళిత, బలహీన వర్గాల వికాసానికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని వారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు. దేశానికి చేసిన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



చందూరులో..



బాల్కొండ మండల కేంద్రంలో..



కోటగిరి మండల కేంద్రంలో..



రుద్రూర్ మండల కేంద్రంలో..



పోతంగల్ మండలంలో...



బోధన్ పట్టణంలో..



ఆలూర్‌లో..



వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో..



డొంకేశ్వర్ మండల కేంద్రంలో..



ముప్కాల్ మండల కేంద్రంలో..

### బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులకు నిరసనగా బీఆర్‌ఎస్ అగ్రనాయకులు హైదరాబాద్‌లో నిరసనకు పిలుపునిచ్చారు. కాగ బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేయడంపై పార్టీ పట్టణ నాయకులు తీవ్రంగా ఖండించారు.
బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తే సహించేది లేదన్నారు.

### పెండింగ్ వేతనం చెల్లించాలి



మోర్తాడ్: గతంలో సమ్మె చేసిన కాలానికి సంబంధించిన పెండింగ్ వేతనం వెంటనే చెల్లించాలని జీపీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో తిరుమలకు వినతిపత్రం అందించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో 33 రోజుల పాటు సమ్మె చేయగా అప్పటి వేతనం ఇప్పటి వరకు చెల్లించలేదని కార్మికులు తెలిపారు. నాయకులు కిషన్, సత్తెక్క, దశరథ్, చిన్నక్క, నాగమణి, గజానంద్, శ్రీనివాస్, దుర్గయ్య, ముత్తక్క పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్
- కొనసాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు

మోర్తాడ్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఎంతో జరిగిందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. భీమ్‌గల్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో సునీల్‌రెడ్డి ఓటమిపాలైనా ప్రజలకు ఇచ్చిన హామీలో ప్రధానమైన గంజాయి నిర్మూలనకు కట్టుబడి ఉన్నారని అయన కొనియాడారు. బాల్కొండ నియోజకవర్గంలో గంజాయిని నిర్మూలించి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. భీమ్‌గల్ పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికను రూపొందించామని వివరించారు. మున్సిపల్ చైర్మన్ ప్రేమలత, నాయ



భీమ్‌గల్‌లో మాట్లాడుతున్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్

కులు బొదిరె స్వామి, సురేందర్, దేవదాస్, జేజే నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**హామీలను నెరవేరుస్తున్నాం..**

పెర్కిట్(ఆర్మూర్): సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవాల్లో వినయ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆలూర్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌రెడ్డి



ఆలూర్‌లో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

**పారిశుధ్య పనుల పరిశీలన..**

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 21వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. కాలనీల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు.

### ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

మోర్తాడ్: పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపకుడు, బీఆర్‌ఎస్ నాయకుడు రాజారాం యాదవ్ సూచించారు. భీమ్‌గల్‌లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో శుక్రవారం అయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలను నిర్వహించనున్న దృష్ట్యా ఓటు హక్కు లేని వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు దొన్కంటి నర్సయ్య, మూత లింబాద్రి, పర్స నవీన్, రాగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం ధర్నాచౌక్‌లో రిలే దీక్షలు చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమను రెగ్యులర్ చేయాలని, హెల్త్‌కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు. వీరి నిరసనకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగెళ్ల సురేష్, తపస్ నాయకులు మద్దతు పలికారు.

### కందకుర్తిలో వైద్యశిబిరం



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 82 మందికి పరీక్షలు నిర్వహించగా, 20 మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. వీరికి బోధన్‌లోని లయన్స్ కంటి ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని కంటి వైద్యుడు సతీష్ పేర్కొన్నారు. హన్మంత్‌రావ్, సురేష్, అద్నాన్, రవీంద్రబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

### హిందూ పిల్లలకు శాంతాక్లాజ్ వేషం వెయ్యొద్దు



ఆర్మూర్‌టౌన్: క్రిస్మస్ ప్రోగ్రాంలో భాగంగా హిందూ పిల్లలకు శాంతా క్లాజ్ వేషం వేయించద్దని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలను శుక్రవారం వారు కలిసి, మాట్లాడారు. హిందూ మనోభావాలను గౌరవించి క్రిస్టియన్ పిల్లలతో మాత్రమే క్రిస్మస్ జరుపుకునే విధంగా చూడాలన్నారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సభ్యులు గంగాచరణ్, రవి, ఆనంద్, శీను ఉన్నారు.

## ఆధ్యాత్మికం..

- ఆది మల్లన్న జాతర ప్రారంభం

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో శుక్రవారం ఆది మల్లన్నస్వామి జాతర శుక్రవారం ప్రారంభమయింది. ఈసందర్భంగా స్వామివారికి వీడీసీ ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు నిర్వహించి, గోదావరి నది స్నానానికి పల్లకీలో తీసుకెళ్లారు. శనివారం సాయంత్రం గ్రామం నుంచి రథం(సిడె) జాతర జరిగే మల్లన్న గుట్టకు చేరుతుంది. ఆది



వారం రథోత్సవం, జాతర, సోమవారం నైవేద్యం, నాగవెల్లి, అగ్నిగుండం కార్యక్రమాలు జరుగుతాయని వీడీసీ సభ్యులు పేర్కొన్నారు.

## సంక్షిప్తం

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

పెర్కిట్(ఆర్మూర్): ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దినేష్ సూచించారు. ఆలూర్ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలతో పాటు దేగాం పీహెచ్‌సీలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నీటి నిలువలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది సంతోష్, ఉదయ్, జమున, రాజగంగు, నాగలత, పద్మ, భూలక్ష్మీ, ఎలిజిబెత్ తదితరులు పాల్గొన్నారు.

**ఆర్థికసాయం అందజేత**



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్‌కు చెందిన అల్ఫీనముస్కాన్ అనే బాలిక గత కొన్ని సంత్సవరాలుగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. సమస్యను తెలుసుకున్న ఈఆర్ ఫౌండేషన్ చైర్మన్, చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు సైఫ్, సడక్ ప్రమోద్, ఇస్తాకుద్దీన్, సిద్ధార్థ పాల్గొన్నారు.

**కబడ్డీ క్రీడాకారునికి..**

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన హేమంత్ అనే క్రీడాకారుడికి వైద్య చికిత్స కోసం కబడ్డీ



అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ శుక్రవారం రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. గంగారెడ్డి, అంజయ్య శ్రీకాంత్, సంజీవ్ థామస్, గోపిరాము, గంగారాం పాల్గొన్నారు.

**నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్లకు సర్వే**

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన సర్వే శనివారం నుంచి ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైతే ప్రజాపాలన దరఖాస్తులో ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక చేసుకున్నారో వారికి మాత్రమే ఈ సర్వే చేయడం జరుగుతుందన్నారు. సర్వే అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ఇంటి పత్రాలకు సంబంధించిన డాక్యుమెంట్లు అందుబాటులో ఉండాలని సూచించారు.

**స్వర్గరథం వితరణ**



నవీపేట: మండలంలోని యంచ గ్రామానికి చెందిన వంజరి రాజారాం పెద్ద గంగాధర్, చిన్న గంగాధర్‌ల జ్ఞాపకార్థం వారి బంధువులు శుక్రవారం స్వర్గరథాన్ని వీడీసీకి వితరణ చేశారు. వేద భారతి పీఠాధిపతి విద్యానందగిరి స్వామి చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేశాక వీడీసీ ప్రతినిధులకు అప్పగించారు.

**విద్యార్థుల పుస్తక పఠనం**



వేల్పూర్: మండలంలోని కుకునూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా విద్యార్థులు పుస్తకం పఠనం నిర్వహించారు. స్థానిక తెలుగు పండితుడు పఠాని గంగాధర్ పుస్తక పఠనాన్ని ఏర్పాటు చేయగా, విద్యార్థులు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పుస్తక పఠనం చేశారు. హెచ్‌ఎం హరిచరణ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సైబర్‌నేరాలపై కళాజాత**



నవీపేట: మండలంలోని ఫకీరాబాద్ గ్రామంలో శుక్రవారం సైబర్‌నేరాలపై పోలీసులు కళాజాత ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండలన్నారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ రక్షణ కల్పిస్తుందన్నారు. ఎవరైనా అత్యవసర సమయంలో 100 కాల్‌చేయలన్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్‌ఐ యాదగిరిగౌడ్, కళాబృందం సభ్యులు శ్రీనివాస్, చంద్రశేఖర్, రాజేందర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

## వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)**

| | |
|---|---|
| స్క్రీన్-2 – | పుష్ప-2(తెలుగు) - 10.15 2.20 6.25 10.30 |
| స్క్రీన్-3 – | పుష్ప-2(తెలుగు) - 9.30 1.35 5.40 9.45 |
| స్క్రీన్-4 – | పుష్ప-2(తెలుగు) -2.05 6.10 |

**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | పుష్ప-2(తెలుగు)-10.00,2.00, 6.00, 10.00 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | పుష్ప-2(తెలుగు)-10.15 2.20 6.25 10.30 |
| స్క్రీన్-2 | పుష్ప-2(తెలుగు)-9.30,1.35, ,5.40, 9.45 |
| స్క్రీన్-3 | పుష్ప-2(తెలుగు)-10.00,2.05, 6.10, 10.15 |
| స్క్రీన్ -4 | పుష్ప-2(తెలుగు)-9.45,1.50, 5.55, 10.20 |
| లలితామహల్ | పుష్ప-2(తెలుగు) |
| దేవి | పుష్ప-2(తెలుగు) |
| నటరాజ్ | పుష్ప-2 (హిందీ) |
| విజయ్ | పుష్ప-2 (తెలుగు) |

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 77,300 | వెండి(కిలో) | 94,000 |
| 22 క్యారెట్స్ | 71,317 | – నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 200 |
| | | లైవ్ | 140 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 800 |